## ధాన్యం కొనుగోళ్లకు చెల్లింపులు

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి అంకంలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఈ నాటికి 93,373 మంది రైతుల నుండి 4,08,008,480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, అందులో 79,147 మంది రైతులకు 826,34 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని, జిల్లా వ్యాప్తంగా 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసి వేశామన్నారు. రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యాన్ని చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

## యూరియా యాప్‌లో బుక్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** యూరియా బుకింగ్ యాప్ అందుబాటులోకి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు యూరియా కోసం అనవసరంగా తొందరపడవద్దని ఆయన సూచించారు. ప్రస్తుతం తీసుకున్న యూరియాను వెంటనే వినియోగించే అవకాశం లేకపోతే 15 నుంచి 30 రోజుల వరకు నిల్వ ఉంచాల్సి వస్తుందని, దీంతో దాని నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వరి, పత్తి తదితర పంటలకు అవసరమైన సమయంలో యూరియాను వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. యూరియాను ఇంట్లో లేదా ఇతర ప్రదేశాల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచితే దాని ప్రభావం తగ్గి పంటలకు అవసరమైన పోషకాలు పూర్తి స్థాయిలో అందకపోవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల పంటల దిగుబడిపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు తమ పంటలకు యూరియా అవసరమైన సమయంలో మాత్రమే బుకింగ్ యాప్ ద్వారా నమోదు చేసుకుని ఎరువులను పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ సూచించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

### మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు శ్రీకాంత్‌గౌడ్



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** పటాన్‌చెరు మండల చిట్కుల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 329 కాలనీలో నెలకొన్న గృహ నిర్మాణ సమస్యలపై మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు గడీల శ్రీకాంత్ గౌడ్ , గ్రామ పెద్దలు, కాలనీ ప్రజలతో కలిసి సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు , భూ హక్కులు , ఇతర పరిపాలన సమస్యలను శ్రీకాంత్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. గతంలో చిట్కుల్ గ్రామంలోని సర్వే నెంబర్ 329లో పేదలకు ఇచ్చినటువంటి పట్టా సర్టిఫికెట్లకు సంబంధించిన అనేక ఆరోపణల నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ యంత్రాంగం అక్రమ కట్టడాలను కూలగొట్టారు. ఇండ్లను కూలగొడుతున్న విషయం తెలుసుకున్న పటాన్‌చెరు మాజీ జెడ్‌పిటిసి గడీల శ్రీకాంత్ గౌడ్ అక్కడికి వచ్చి నిజమైన లబ్ధిదారుల ఇళ్లను కూలగొట్టకుండా ఆపివేయించారు. ఈ సందర్భంగా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. అనంతరం సంబందిత అధికారులతో మాట్లాడి మండల రెవెన్యూ (అధికారి ) ఎమ్మార్వో ,జిల్లా కలెక్టర్ తో చర్చించి 329 సర్వే కాలనీలో నివసిస్తున్న కుటుంబాలకు గృహ నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిస్కారం కల్పించేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాలనీ ప్రతినిధులు ,స్థానిక ప్రజలు ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

### జనరల్ మేనేజర్ రాధాకృష్ణ



**ప్రజాపక్షం / కాసిపేట :** పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యత కలిగిన బొగ్గును అందించడంతో పాటు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట1 ఇంక్లైన్ గనిని ఆయన సందర్శించి, గని అండర్‌గ్రౌండ్‌లో అమలు చేస్తున్న రక్షణ చర్యలు, పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గనిలో రక్షణ ఏర్పాట్లు, ఉత్పత్తి విధానాలను తనిఖీ చేసి మాట్లాడారు. గనిలో అనుభవజ్ఞులైన ఉద్యోగులు, అధికారులు ఉన్నారని, వారి నైపుణ్యాన్ని వినియోగించి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. యంత్రాలను సమర్థవంతంగా ఉపయోగించి సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. కాసిపేట గనిలో కార్మికుల గైర్హాజరు అధికంగా ఉండటం వల్ల ఉత్పత్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులు ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఉందని, దాంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని అన్నారు. గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి హాజరు శాతాన్ని పెంచేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజరై కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సతీష్, ఏరియా ఐఇడి సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఇంజనీర్ కిరణ్ కుమార్, రక్షణాధికారి సురేష్, సర్వేయర్ ప్రభాకర్, ఖాన్ సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎన్‌ఆర్‌ఐ

**ప్రజాపక్షం / ముథోల్ :** మండల కేంద్రానికి చెందిన ఆకుల తిరుపతి గౌడ్ సరస్వతీ గార్ల కుమార్తె ఆకుల నవ్యశ్రీ గౌడ్ ఎన్‌ఆర్‌ఐ ప్రతీ ఏటా నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులు ఠాకూర్ నవ్యశ్రీ తండ్రి రాజు సింగ్, వరుణ్ తేజ్‌గౌడ్ తండ్రి బాలాజీల యొక్క 2026–2027 విద్యా సంవత్సరం వార్షిక ఫీజు రూ.32400 తన తండ్రి అయిన ఆకుల తిరుపతి గౌడ్ చేతుల మీదుగా చెల్లించి మరోసారి మానవత్వాన్ని చాటుకుంటూ ఎంతో ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆకుల నవ్యశ్రీ గౌడ్ చరవాణిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యా దానమే మహాదానంగా భావించి ప్రతి సంవత్సరం పేద విద్యార్థులను గుర్తించి వారి యొక్క పూర్తి ఫీజు చెల్లించడం జరుగుతుందన్నారు. తాను కూడా పేదరికం నుండే వచ్చి కష్టపడి చదివి ఈ రోజు అమేరికాలో ఉన్నతోద్యోగంలో కొనసాగుతున్నానన్నారు. ఈ సంవత్సరం నవ్యశ్రీ వారి అమ్మమ్మ కీ.శే.ముష్కం వినోద, తాతయ్య కీ.శే. ఆకుల సత్యనారాయణ గౌడ్ గార్ల జ్ఞాపకార్థం ఇద్దరు పేద విద్యార్థులను ఎంపిక చేసి వారికి తనవంతుగా ఆర్థిక సహాకారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ ఆకుల నవ్యశ్రీ గౌడ్‌కు అందుకు ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులకు పాఠశాల కమిటీ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## గెలిచిన ప్రభుత్వాలు కార్మిక ద్రోహులే

### కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కార్మిక ద్రోహులుగానే మిగిలాయని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్‌కె 7 గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్మికుల అండదండలతో గెలిచిన యూనియన్ అనుబంధ పార్టీలు గెలిచిన ఆనందంలో కార్మికుల సమస్యలను విస్మరించాయని తప్పుపట్టారు. సంస్థపరమైన ఆస్తులను పక్కదారి పట్టించడంలో ఉన్న శ్రద్ధ, కార్మికుల సంక్షేమంలో లేదని విమర్శించారు. కార్మికుల పెరిక్స్ ఇన్‌కమ్ టాక్స్, సొంతింటి పథకం, మారుపేర్ల సమస్య, మెడికల్ బోర్డు వంటి సమస్యల పరిష్కారంలో గెలిచిన సంఘాలు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న టిఆర్ఎస్ భవిష్యత్తులో అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే సమస్యల పరిష్కారం దిశగా పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీరాంపూర్ లోని బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కార్యకర్తలు, హెచ్ఎంఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో నిధులిచ్చి సమస్యను పరిష్కరిస్తాం


### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం / కుంటాల :** కుంటాల మండలంలోని ఆదర్శ పాఠశాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పలు సమస్యలను పాఠశాల ప్రిన్సిపాల్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆవరణ అంతా తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్య పరిష్కారానికి తనవంతుగా పాటుపడతానని అన్నారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి 48 గంటల్లో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుంటాల సర్పంచ్ గజేందర్, మాజీ ఎంపిపి గజ్జారాం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిని నిధులు ఇస్తానన్న ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కుంటాల మండలం దౌనెల్లి గ్రా మంలో ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే పవార్ రా మారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యేను స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నా రు.

## ధాన్యం తరుగు పేరిట రూ. కోట్ల దోపిడీ

### మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ నియోజకరవ్గంలో ధాన్యపు కొనుగోలు ప్రక్రియలో స్థానిక శాసనసభ్యుడి అండదండలతో పెద్ద ఎత్తున అక్రమాలు, దోపిడి రాజ్యమేలుతున్నాయని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుమారు 17 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జరుగుతున్న ఈ కొనుగోళ్లలో, కేవలం 'తరుగు' అనే సాకు చూపిస్తూ రైతుల నోట్లో మట్టికొట్టి, దాదాపు ఒక కోటి పదిహేడు లక్షల రూపాయల మేర అవినీతి సొమ్మును కొల్లగొట్టారని ఆయన ఆరోపించారు. చివరకు మూటలు మోసే కార్మికులకు ఇవ్వాల్సిన కూలీలను సైతం సక్రమంగా ఇవ్వకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ సంపాదనతో శాసనసభ్యుడు తన జేబులు నింపుకోవడమే ధ్యాసగా పెట్టుకున్నారని అల్లోల ఆరోపించారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఎలాంటి తరుగు సమస్యలు లేకుండా రైతుల ప్రయోజనాన్నే పరమావధిగా చేసుకుని కొనుగోళ్లు సాగాయని గుర్తు చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను తప్పుబడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడటం, తెలంగాణ సమాజంపై విషం కక్కడమేనని నాయకులు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమం అనేది సకల జనుల ఆకాంక్ష అని, తొలిదశ ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు ఎందరో అమరుల ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని పేర్కొన్నారు. తెలంగాణను అక్రమంగా సాధించుకున్నామని మాట్లాడటం అమరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్‌సిఎస్. అధ్యక్షుడు ధర్మాజి రాజేందర్, చైర్మన్ అయిర నారాయణరెడ్డి, మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, బనసపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు రమణారెడ్డి, అప్పాల మహేష్, పాకాల రాంచందర్, మాజీ గ్రామ సర్పంచులు, పురపాలక సంఘ సభ్యులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతీ సొసైటీకి యూరియా నిల్వల కేటాయింపులు: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకవసరమైన మేరకు పూర్తిస్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయన్నారు. అన్ని సొసైటీలకు ఎరువులను చేరవేస్తూ, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో రైతులకు పారదర్శకంగా ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకనుగుణంగా అన్ని ప్రాంతాలకు యూరియా బస్తాలను కేటాయిస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో లక్షా 39 వేల మంది రైతులకు బుకింగ్ యాప్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా 3.78 లక్షల బస్తాల రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. యూరియా ఎరువుల విషయమై రైతులు కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలకం కానుందని సూచించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా యువత

### సిపి అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా యువతకు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి డివిజన్ తాళ్ల గురజాల గ్రామంలో బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి యువతకు అరైవ్‌అలైవ్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్ తో కలిసి సిపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో, స్పష్టమైన లక్ష్యంతో జీవితంలో ముందుకు సాగాలని కోరారు. స్నేహితుల ప్రలోభాలకు లోనై మత్తు పదార్థాల వైపు వెళ్లకూడదని, వాటిని విక్రయించే వారు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 18 సంవత్సరాలు నిండిన వారే డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా కలిగి ఉండి ప్రయాణించాలని తెలిపారు. అనంతరం డిసిపి భాస్కర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి సమాచారం తెలిస్తే డయల్ 100కు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువకులు పుష్‌అప్స్ ప్రదర్శించగా, ప్రతిభ కనబరిచిన ఒక యువకుడిని సిపీ శాలువాతో సత్కరించి రూ.500 నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సిఐ హనుక్, సబ్ ఇన్స్పెక్టర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిఎం, మంత్రులపై అవినీతి ఆరోపణలు అవివేకం

### డిసిసి అధ్యక్షుడు నగేష్‌రెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సిఎం, మంత్రులు అవినీతి చేశారని ఆరోపించడం అవివేకమని, ఆధారాలు ఉంటే చూపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం, మంత్రులు అవినీతి చేశారని ఎంపి అరవింద్ ఆరోపించడం కాదు, నీకు దమ్ము ధైర్యముంటే అవినీతి చేశారని ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. ఒక పక్క కేంద్రంలో నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో యువకులు రోడ్లపైకి వచ్చి ఢిల్లీలో ధర్నాలు చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయమని డిమాండ్ చేస్తుంటే ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలన్నారు. యూరియా యాప్ అనేది కేవలం తెలంగాణలో మాత్రమే లేదని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అన్ని రాష్ట్రాలలో యూరియా యాప్ ఉందన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే మిగతా రాష్ట్రాలలో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఏడేళ్లు పార్లమెంట్ సభ్యునిగా నిజామాబాద్ పార్లమెంట్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకరాలేదని రైల్వే బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. పసుపు బోర్డు పేరుకే తీసుకువచ్చారని, దానిలో అధికారులను నియమించలేదని పసుపు బోర్డుతో పసుపుకు మద్ధతు ధర ఇప్పించటంలో అర్వింద్ విఫలమయ్యారని నగేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, డీసీసీ కోశాధికారి భక్త వత్సలం, డీసీసీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, డీసీసీ కార్యదర్శి గణేష్, కరీంద్దీన్, మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

### కలెక్టర్ భవేశ్‌మిశ్రా




**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గల మందుల గది, ఇంజక్షన్‌గది , ఒపి విభాగం, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, విభాగాలు, పలు వార్డులు పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన మందులు, ఒపి, తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కేజీబీవీ వసతి గృహాన్ని పరిశీలించారు అధికారులు, ఉపాధ్యాలతో మాట్లాడుతూ, వసతి గృహంలో విద్యార్థులకు అన్ని సౌ సౌకర్యాలు కల్పిస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అన్నారు. ప్రతీ రోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. మోతాక్ పల్లి గ్రామం సుద్ద వాగులో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా జరగకూడదన్నారు. నిత్యం ప్రత్యేక నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనాలను జప్తు చేయాలని ఆదేశించారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానిక గండిపడే విధంగా ఇసుక అక్రమ రావాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో డిఈవో భోజన్న, తహసిల్దార్లు శ్రీకాంత్, ఎంపిడీవో పుష్పలత, ఆసుపత్రి వైద్యాధికారి ప్రమోద్ చంద్రారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం



**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మందమర్రిలోని బి1 క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దడంతో పాటు, కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ధ్రువపత్రాల కొరత కారణంగా ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకూడదని, అవసరమైన పత్రాలను సమకూర్చుకునే విషయంలో ఓటర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుండాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## రైల్వే భూ బాధితులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం / రెబ్బెన :** రెబ్బెనలోని రైల్వే, రెవెన్యూ భూ వివాద సమస్యను పరిష్కరించి బాధితులను ఆదుకోవాలని అఖిలపక్ష కమిటీ నాయకులు, భూ బాధితులు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడెం నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ పట్టణంలో బిజెపి జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిని కలిసి సమస్యను వివరించారు. రెబ్బెనలో గత 60 సంవత్సరాలుగా ప్రభుత్వ రెవెన్యూ భూమిలో చిన్న చిన్న షాపులు, హోటళ్లు ఏర్పాటు చేసుకుని దాదాపు 250 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. దాదాపు 33 సంవత్సరాల క్రితం అప్పటి సబ్ కలెక్టర్ కరికెల్ వలేవన్ కొంతమందికి ప్లాట్లు కేటాయించారని పేర్కొన్నారు. అయితే 23 సంవత్సరాల క్రితం రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చి నిర్మాణాలు తొలిగించాలని కోరడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. బాధితుల ఆవేదనను ఆలకించిన ఎంపీ గోడెం నగేష్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల గంగాపూర్ గేట్ ఎల్‌సీ71 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎంపీకి రెబ్బెన మండల ప్రజల తరఫున మండల అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సర్పంచ్ దుర్గం భరద్వాజ్, మోడెమ్ సుదర్శన్ గౌడ్, గుల్బం చక్రపాని, పల్లె రాజేశ్వర్ రావు, బొమ్మినేని శ్రీధర్, అజయ్ జైస్వాల్, కనగల మాణిక్య రావు, చెన్న శ్రీనివాస్, జహీర్ బాబా, ఇందురి రవీందర్, రాయిల్ల కృష్ణ పాల్గొన్నారు.

## నిజాంసాగర్ విద్యార్థికి టిజిఆర్‌జెసిలో సీటు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్ విద్యార్థి బొడమీది రమేష్ ప్రతిభ కనబర్చి పోచంపాడు తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల సీటు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయబృందం విద్యార్థి రమేష్‌ను అభినందించారు. బీసీ హాస్టల్‌కు చెందిన రమేష్ తన కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాదించడం పాఠశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సా ధించి తల్లితండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మం చిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రమేష్‌ను ఆదర్శం గా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని, తమ లక్ష్యాలను చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు.

## సబ్‌స్టేషన్ తనిఖీ చేసిన సిఎండి



**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ జిల్లా పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ల పనితీరు లైన్ల నిర్వహణను మెరుగుపరిచేందుకు విద్యుత్ సంస్థ గౌరవ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఎండి. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన కడెం మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మల్ ఆపరేషన్స్ సూపరింటెండింగ్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, ఖానాపూర్. ఏడిఈ, కడెం ఏఈ, ఒఅండ్ఎం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సబ్ స్టేషన్ యొక్క పనితీరును, రోజువారి నిర్వహణ కార్యకలాపాలను సిఎండి నిశితంగా సమీక్షించారు. వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేని, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా అడవి ప్రాంతాల గుండా వెళ్లే 33 కెవి విద్యుత్ లైన్ల ద్వారా చెట్లు, వన్యప్రాణుల వల్ల కలిగే అంతరాయాలను నివారించడానికి భద్రతను పెంచడానికి ఆయా ప్రాంతాల్లో కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో లైన్లపై పనిచేసేటప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాల గురించి చర్చించిన ఆయన, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పిపిఈ కిట్లు నిర్దేశిత రక్షణ పరికరాలను ధరించాలని స్పష్టం చేశారు. అనంతరం కడెం సెక్షన్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో అలాగే, ఖానాపూర్ సెక్షన్ పరిధిలోని మస్కాపూర్ గ్రామంలో దెబ్బతిన్న 33 కేవీ కడెం ఫీడర్ లైన్ ప్రాంతాలను సీఎండీ స్వయంగా పరిశీలించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా ఉండటానికి, నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి లైన్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను క్రమం తప్పకుండా తొలగించాలని క్షేత్రస్థాయి అధికారులకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటన ముగింపులో భాగంగా నిర్మల్ ఎస్ఇ, డీఈలతో పాటు ఖానాపూర్, మామడ, దస్తూరాబాద్, కడెం, పెంబి మండలాల ఆపరేషన్స్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో సిఎండీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని ఆపరేషన్ డివిజన్ల సాంకేతిక, వాణిజ్య పరమైన పనితీరును, ప్రగతిని ఆయన కూలంకషంగా సమీక్షించారు. విద్యుత్ నష్టాలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపర్చడానికి ఎక్కడెక్కడ మార్పులు చేయాలో గుర్తించి, ఆయా విభాగాల అధికారులు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సిఎండీ కఠిన ఆదేశాలు జారీ చేశారు.

